క్లుప్తంగా

బోరంచ నల్లపోచమ్మకు పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న సర్వేశర మహారాజ్, తదితరులు

మనూరు(నారాయణఖేడ్): జిల్లాలో ప్రసిద్ధి చెందిన బోరంచ నల్లపోచమ్మను వట్‌పల్లి మండలం దుద్యాలా ఆశ్రమ పీఠాధిపతి సర్వేశ్వర మహారాజ్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ పూజారులు ఆయనకు సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతనతో నడుచుకోవాలని, మంచి అలవాట్లతో సమాజంలో పేరు వస్తుందని సూచించారు. కార్యక్రమంలో పూజారులు నాగయ్య స్వామి, శ్రీకాంత్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సినిమా చిత్రీకరణ ప్రారంభం



క్లాప్ కొడుతున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

నారాయణఖేడ్: మండలంలోని లింగాపూర్‌లో నూతనంగా ప్రారంభించిన సినిమా చిత్రీకరణను డీఎస్పీ జె.వెంకట్‌రెడ్డి క్లాప్‌కొట్టి ప్రారంభించారు. లింగాపూర్‌కు చెందిన విఠల్‌గౌడ్ ఈ చిత్రానికి నిర్మాతగా వ్యవహరిస్తుండగా చిత్త జల్లుప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సందర్భంగా దేశ్‌పాండే సుభాష్ పూజ చేసిన అనంతరం గ్రామంలో పలు సన్నివేశాలను చిత్రీకరించారు. కథానాయకుడిగా శివనాయుడు, కథానాయికగా గోవాజ్యోతి నటిస్తున్నారు. అనంతరం చిత్రయూనిట్ సభ్యులు డీఎస్పీని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీ రాధాకృష్ణ, బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు అంజాగౌడ్, సహాయ దర్శకుడు మురళీకృష్ణ, శ్రీఖర్, కెమెరామెన్‌లు కృష్ణనాయుడు, సంగీత, లక్ష్మణసాయి, కొరియోగ్రాఫర్ రామారావుగౌడ్, నటీనటులు సునీత, పొట్టి చిట్టిబాబు, సుమన్‌శెట్టి, పూజిత, చెన్నకేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి రివార్డు



నగదు రివార్డు అందుకున్న సిబ్బంది

నారాయణఖేడ్: ఖేడ్ ఆర్టీసీ డిపో పరిధిలో ఉత్తమ ప్రతిభ చూపిన ఆర్టీసీ సిబ్బందికి డీఎం మల్లేశయ్య నగదు రివార్డ్ అందించారు. ఏడుపాయల జాతరకు నడిపిన బస్సులతో గతేడాది కంటే రూ.2.26లక్షల ఆదాయం అదనంగా సమకూరడంతో డ్రైవర్లు, కండక్టర్లు, టీం డ్రైవర్లను శనివారం అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, అజీం, మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జ్ పాండు ఉన్నారు.

మాంసం దుకాణాదారులకు నోటీస్‌లు



నోటీస్ అందజేస్తున్న మున్సిపల్ అధికారులు

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మాంసం దుకాణాదారులకు మున్సిపల్ అధికారులు శనివారం నోటీసులు జారీ చేశారు. దుకాణాల నుంచి వెలువడే వ్యర్థాలను ఇష్టానుసారంగా పారవేయవద్దని, దుకాణ ఆవరణ శుభ్రంగా ఉంచుకోవాలని నోటీసుల్లో పేర్కొన్నారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కుక్కల సంచారాన్ని నివారించడానికి నోటీసులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా



మాట్లాడుతున్న కార్పొరేటర్ కుమార్

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సింఫనీ హోమ్స్, సాయి గణేష్ కాలనీ, నందన్ రతన్ ప్రైడ్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో ముచ్చటించారు. రోడ్డు, డ్రైనేజీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నానని, ఏవైనా తసమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు.

ప్రణాళికాబద్ధంగా అమీన్‌పూర్ అభివృద్ధి

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



అభివృద్ధిపనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని ఎమెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని జయలక్ష్మి నగర్‌లో రూ.40 లక్షలతో సీసీ రోడ్డు, గ్రీన్ ఫీల్డ్స్ కాలనీలో రూ.75 లక్షలతో సీసీ రోడ్డు, రెండో వార్డులో రూ.30 లక్షలతో చేపట్టనున్న కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రెండో వార్డులో రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన పార్క్, రూ.30 లక్షలతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనాలను ప్రారంభించారు. అనంతరం పెద్ద చెరువు కట్టపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఒకప్పుడు అమీన్‌పూర్ అంటే మంచినీటి కొరతకు చిరునామాగా ఉండేదని, నేడు ప్రతీ ఇంటికీ మిషన్ భగీరథ ద్వారా రక్షిత మంచినీరు అందిస్తున్నామన్నారు. రూ.18 కోట్లతో పెద్ద చెరువు నుంచి హెచ్‌ఎంటీ వరకు రహదారి నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చక్రపురి కాలనీలో రూ.11 కోట్లతో 33/11 కేవీ సబ్ స్టేషన్ పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు పెద్ద చెరువు కట్టను సుందరీకరణ చేయడంతో పాటు, అల్లూరి సీతారామరాజు, ఛత్రపతి శివాజీ విగ్రహాలను సొంత ఖర్చుతో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని మున్సిపల్ ముఖద్వారంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, మున్సిపల్ కమిషనర్ సుజాత, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పేదల అండగా కేసీఆర్ ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం రామచంద్రాపురం రెవెన్యూ కార్యాలయంలో తెల్లాపూర్, బండ్లగూడ, రామచంద్రాపురం, వెలిమెలకు చెందిన 23 మంది లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్ కే చెందుతుందని అన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయని, పేదింటి ఆడపిల్ల పెళ్లికి షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి ద్వారా సాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధిలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పుష్ప, సింధు, తహసీల్దార్ జయరాం, మాజీ సర్పంచ్ మల్లేపల్లి సోమిరెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గోవింద్ తదితరులు పాల్గొన్నారు. నిరుపేదలకు అండగా కేసీఆర్ ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధి ఇంద్రానగర్ కాలనీకి చెందిన శ్రీనుకు ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుంచి మంజూరైన ఎల్‌ఓసీని మాజీ సర్పంచ్ సోమిరెడ్డికి అందించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం పాశమైలారంలో అనారోగ్యంతో మృతి చెందిన సర్పంచ్ ఎరుకల పోచయ్య మృతదేహానికి శనివారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి నివాళి అర్పించారు. పోచయ్య కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయనతో నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఉపసర్పంచ్ కృష్ణ యాదవ్, చందు, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న రాచన్నస్వామి ఉత్సవాలు



అగ్నిగుండం దాటుతున్న భక్తులు

కోహీర్(జహీరాబాద్): బిడంపేట రాచన్న స్వామి ఆలయంలో వార్షిక జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శనివారం భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. రాత్రి నుంచి జాగరణ చేసిన భక్తులు తెల్లవారుజామున అమృతగుండంలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఏర్పాటు చేసిన అగ్నిగుండం దాటి స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వీర శైవాచార్యుల వీరంగాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అకట్టుకున్నాయి. ఆలయ నిత్యాన్నదాన సత్రంలో కొలాస్ పరివారం, చిల్కెపల్లి కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం స్వామివారి కల్యాణోత్సవం ఉంటుందని, సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

నిబంధనల మేరకు నిర్మాణం చేపట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిబంధనల మేరకు తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు పనులు చేపట్టాలని తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ సభ్యులు కోరారు. శనివారం కాలనీవాసులతో కలిసి మున్సిపాలిటీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, మున్సిపల్ వైస్ చైర్మన్ రాములగౌడ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ మాట్లాడుతూ మై ఫెయిర్ ఇన్ఫినిటీ నుంచి ఉస్మాన్ నగర్ వైపు వెళ్లే రోడ్డు విషయంలో హెచ్‌ఎండీఏ అధికారులు 60 ఫీట్ల రోడ్డు ఉన్నట్టుగా అనుమతులు ఇచ్చారని, మున్సిపాలిటీ రికార్డుల ప్రకారం ఆ రోడ్డు 36 ఫీటు ఉన్నట్టు చెబుతున్నారని అన్నారు. రోడ్డును 60 ఫీట్లు వెడల్పు చేసి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను జరిపి అభివృద్ధి చేయాలని, డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకీకరించాలని కోరారు. కార్యక్రమంలో తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, ముప్పా విల్లాస్ అధ్యక్షుడు మదన్, సాన్వియా విల్లాస్ అధ్యక్షుడు రామ్ కుమార్, బీడీఎల్ అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన ఉండాలి

జహీరాబాద్ టౌన్: విద్యార్థులు పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలని డీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. మంచి ఆహారంతో రోగాల భారిన పడకుండా సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. జంక్ ఫుడ్ జోలికి వెళ్లొద్దని, చిరుధాన్యాలు, జవార్, రాగి సలాడ్‌తో పాటు తాజా కూరగాయలు, పండ్లు తీసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ అస్లాం ఫారూఖీ మాట్లాడుతూ ఆహారంలో సమతౌల్యం దెబ్బతినడంతోనే వ్యాధులు సోకుతాయని అన్నారు. కార్యక్రమంలో డీడీఎస్ సంస్థ సభ్యులు మాణిక్యం, చంద్రమ్మ, చుక్కమ్మ, నరసమ్మ, పూలమ్మ, విజయలక్ష్మి, మంజుల, వినయ్‌కుమార్, ప్రసాద్, రమేష్, హేమలత, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

కొండాపూర్(సంగారెడ్డి): హెచ్‌సీయూ ఎన్నికల సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సంగారెడ్డి ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. విద్యార్థులు ఐక్యమై ఎన్నికల్లో విద్యార్థి సంఘం బలోపేతానికి కృషి చేస్తుంటే ఓర్వలేక ఏబీవీపీ నాయకులు దాడి చేశారని ఆరోపించారు. దాడిలో ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి నాయకులు గాయపడ్డారని, పోలీసులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పుండలిక్, సతీష్, పాండు తదితరులున్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి

నారాయణఖేడ్: సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఖేడ్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి సూచించారు. నారాయణఖేడ్ యువచైతన్య డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిచయంలేని వ్యక్తులకు ఓటీపీ, ఏటీఎం పిన్ వివరాలు చెప్పొద్దని అన్నారు. ఆఫర్‌లో కారు గెలిచారు, రుణాలు ఇస్తాం అంటూ ఎవరైనా మెసేజ్‌లు పంపితే స్పందించవద్దని అన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చే వెబ్‌సైట్ లింక్‌లను ఓపెన్ చేయొద్దని వివరించారు. ఇళ్లల్లో కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కిషన్, పోలీసు సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రమాదాలను నివారించండి



జెడ్పీటీసీకి వినతిపత్రం అందిస్తున్న పాలకవర్గ సభ్యులు

జిన్నారం(పటాన్‌చెరు): దోమడుగుగ్రామ ప్రధాన రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ పాలకవర్గ సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం జెడ్పీటీసీ కుమార్‌గౌడ్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మూల మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనదారులు మృతి చెందటంతో పాటు గాయాలపాలవుతున్నారని సర్పంచ్ రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ విషయాన్ని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు.

వేడుకలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించే వేడుకలను విజయవంతంచేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండల పరిషత్ అధ్యక్షుడిగా ఎన్నికైన నాటి నుంచి నేటి వరకు మహిళా దినోత్సవ సంబరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి 3, 4, 6 తేదీల్లో నియోజకవర్గస్థాయి సంబరాలు ఉంటాయని, మొదటి రెండు రోజులు మైత్రి క్రీడా మైదానంలో మహిళా ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 6వ తేదీన జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో బహుమతుల ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖుల ఉపన్యాసాలు ఉంటాయని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో మహిళా ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, ఎంపీపీ సుష్మా, జెడ్పీటీసీ సుప్రజ, మున్సిపల్ చైర్మన్లు లలితా సోమిరెడ్డి, రోజా బాల్ రెడ్డి, కార్పొరేటర్ పుష్ప, మెట్టు రమాదేవి కుమార్ యాదవ్, ఎంఈఓలు, సెర్ప్ ఏపీఎంలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): గ్రామీణ రోడ్ల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బిజిలీపూర్ నుంచి బుద్దాయిపల్లి వరకు రూ.1.80కోట్ల నిధులతో 5.4 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాకే గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయని, ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పద్మారావు, ఖయ్యూం, దీప్లానాయక్, ఎంపీటీసీ నవీన, ఏఎంసీ చైర్మన్ రజనీకాంత్, జెడ్పీటీసీ అపర్ణ, వీరారెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు అశోక్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వినోద్‌గౌడ్, డైరెక్టర్ బుద్ధిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శివాజీరావు, కోశాధికారి సుభాష్, నాయకులు బస్వరాజ్, సదానందం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు చేయూతనివ్వాలి

జోగిపేట(అందోల్): ప్రజలు చేనేత వస్త్రాలను వాడి నేత కార్మికులకు చేయూత నివ్వాలని ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. శనివారం జోగిపేట పట్టణంలోని క్లాక్ టవర్ సమీపంలో చేనేత విక్రయశాల (ఔట్ లెట్)ను ఆయన ప్రారంభించారు. వేసవిలో చేనేత వస్త్రాలు వాడడం ఆరోగ్యానికి మంచిదని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సొసైటీ చైర్మన్ వర్కల అశోక్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ జగన్ మోహన్ రెడ్డి, వట్‌పల్లి ఏఎంసీ చైర్మన్ రజినీకాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రవీణ్ కుమార్, నాయకులు చాపల వెంకటేశం, సత్యం, మహేష్ యాదవ్, బీర్ల శంకర్, ఊస నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వహణకు సహకరిస్తా



యువసేనలో చేరిన యువకులతో నీలం మధు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం పంచాయతీ పరిధిలోని పెద్దమ్మగూడెంలో నిర్వహిస్తున్న మల్లికార్జున స్వామి ఉత్సవాలకు సహకరిస్తానని చిట్కుల్ సర్పంచ్ నీలం మధు తెలిపారు. శనివారం రూ.50వేల విరాళం అందించగా, నిర్వాహకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నర్రిగూడెం గ్రామానికి చెందిన యువకులు మాజీ ఎంపీటీసీ పుట్టి భాస్కర్ ఆధ్వర్యంలో నీలం మధు యువసేనలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి ఆహ్వానం పలికారు. ఊట్ల గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మహేష్ ఆధ్వర్యంలో నీలం మధు యువసేనలో చేరారు.

క్రీడాకారులకు అండగా ఉంటా

పటాన్‌చెరు టౌన్: క్రీడలపై ఆసక్తి ఉన్నవారిని ప్రోత్సహించేందుకు ఎప్పుడు ముందుంటానని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. పటాన్‌చెరు మండలం భానూర్ గ్రామంలో నిహిస్తున్న కబడ్డీ టోర్నమెంట్‌కు ముఖ్య అతిధిగా హాజరై శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు భోజనం, వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందిన జట్టుకు రూ.లక్ష, రన్నరప్‌కు రూ.70వేల, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి రూ.30వేల నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భానూర్ సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ యాదగిరి, వార్డు సభ్యులు స్వర్ణరవి, క్రీడాకారులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం



రాయికోడ్: ఉపాధ్యాయులతో విద్యార్థులు

జోగిపేట(అందోల్): స్వయం పాలన విద్యార్థులకు భవిష్యత్తును గుర్తు చేస్తుందని ఎంఈఓ బండి కృష్ణ అన్నారు. మండలంలోని మాసానిపల్లి యుపీఎస్‌లో శనివారం స్వయం పరిపాలన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ఉన్నత అధికారులుగా వ్యవహరించిన తీరు ఆకట్టుకుందన్నారు. ఈ సందర్భంగా డీఈఓగా నసీర్, ఎంఈఓగా పి.వైష్ణవి, హెచ్‌ఎంగా పి.వైష్ణవి, ఉపాధ్యాయులుగా మాధవి, ప్రవీణ, సంజన, శ్రీజ, వైశాలి, శ్వేత, అఖిల్‌రాజ్, అశోక్, విశాల్, దుర్గాభవానీ, కృష్ణవేణి, శివభరత్, భానుప్రసాద్, స్రవంతి వ్యవహరించారు. సర్పంచ్ రాణి, విద్యాకమిటీ చైర్మన్ రవి, హెచ్‌ఎం జ్యోతికుమారి, ఉపాధ్యాయులు బ్రహ్మం, అహ్మద్ పాషా, కృష్ణ, ఎల్లప్ప పాల్గొన్నారు.

రాయికోడ్‌లో..

రాయికోడ్(అందోల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. 5వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. హెచ్‌ఎంగా వీరమనోహర్, ఎస్‌ఎంసీ చైర్మన్‌గా శివకుమార్, టీచర్లుగా భాగ్యలక్ష్మి, అశ్విని, వెంకట లక్ష్మి, భరత్, అమర్, మనీషా, పూజ, నభియ, నందిని, హారిక, ప్రవళిక, గణేష్, శ్రావణి, మల్లికార్జున్, రిహాన్, శివశంకర్, కలెక్టర్‌గా రేహాన్, డీఈఓగా యదేష్, ఎంఈఓగా వంశీ, వ్యవహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డి.విఠల్, సుధాకర్, శివకుమార్, శ్రావణి, తులసి, సుధ, శేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **వీధికుక్కల నివారణపై అవగాహన**

నారాయణఖేడ్: వీధికుక్కల నివారణపై జాగ్రత్త వహించాలని మున్సిపల్ మేనేజర్ వెంకట శివయ్య అన్నారు. శనివారం ఖేడ్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రోడ్డున వెళుతుంటే వీధికుక్కల జోలికి వెళ్లొద్దని, దగ్గరగా వెళ్లి ఆహార పదార్థాలను వేయొవద్దని అన్నారు. కుక్కల గుంపుగా సంచరించే మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ **జాగ్రత్తగా ఉండాలి**

మునిపల్లి(అందోల్): కుక్కల నుంచి తమ పిల్లలను కాపాడు కోవాలని ఖమ్మంపల్లి ప్రాథమిక పాఠశాల హెచెఎం ఖమ్రోద్దిన్ విద్యార్థుల తల్లిదండ్రులను సూచించారు. శనివారం పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇంటి నుంచి స్కూల్‌కు వచ్చే వరకు, స్కూల్ నుంచి ఇంటికి చేరే వరకు పిల్లలపై దృష్టి సారించాలని అన్నారు.

◆ **బీజేపీ నాయకుల పూజలు**

నారాయణఖేడ్: ఖేడ్ మండలం కొండాపూర్ హనుమాన్ ఆలయంలో శనివారం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప, నియోజకవర్గ కన్వీనర్ రజినీకాంత్, నాయకులు పట్నం మాణిక్, ప్రశాంత్, సంజీవ్‌పాటిల్‌లు పూజలు చేశారు. అనంతరం ఆలయ పీఠాధిపతి, అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహారాజ్‌ను దర్శించుకొని ఆశీస్సులు పొందారు. ఆధ్యాత్మిక, సామాజిక విషయాలపై ఆయనతో చర్చించారు.

◆ **ఖదీర్ కుటుంబాన్ని ఆదుకోవాలి**

నారాయణఖేడ్: పోలీస్‌లు కొట్టడంతో మృతిచెందిన ఖదీర్‌ఖాన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నారాయణఖేడ్ ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓ చంద్రకళకు వినతిపత్రం సమర్పించారు. బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం, భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, డబుల్‌బెడ్‌రూం ఇల్లు, ఎకరం భూమి ఇవ్వాలని కోరారు. మృతికి కారణమైన పోలీసు అధికారులపై కేసు నమోదు చేయాలని, కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అలిగే జీవన్‌కుమార్, భీమన్న, తుకారాం, పండరి, డేవిడ్, శంకర్, శ్రీపాల్ ఉన్నారు.

◆ **విగ్రహావిష్కరణకు తరలిరావాలి**

నారాయణఖేడ్: సంగారెడ్డిలో ఈ నెల 26న ఆదివారం తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణతో పాటు కురుమ సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించనున్నట్లు ఖేడ్ నియోజకవర్గ కురుమ సంఘ అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు. నియోజకవర్గంలోని కురుమలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

◆ **వెంకటాచల దివ్య క్షేత్రంలో పూజలు**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): భక్తుల గోవింద నామస్మరణ, అన్నమయ్య సంకీర్తనల నడుమ వెంకటాపూర్ శివారులో వేంకటేశ్వరుడికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల, సదాశివపేట పట్టణ ప్రజలు స్వామివారిని దర్శించుకొని మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిల్వేరి వెంకటేశం, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

◆ **కేంద్ర పథకాలతోనే అభివృద్ధి**

మనూరు(నారాయణఖేడ్): కేంద్ర ప్రభుత్వ అందిస్తున్న డబ్బుతో బీఆర్‌ఎస్ నాయకులు అభివృద్ధి పనులు చేపడుతున్నారని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి ఆరోపించారు. నాగల్‌గిద్ద మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన బీజేపీ కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగూరుకు నీరు ఇవ్వలేని నాయకులు కాళేశ్వరం నీళ్ల అంటూ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. సింగూరు జలాలను నిజామాబాద్, సిద్దిపేటకు తీసుకు వెళుతున్నారని విమర్శించారు. తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని అన్నారు. సమావేశంలో అసెంబ్లీ కోఆర్డినేటర్ మారుతిరెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, సిద్దయ్య స్వామి, తదితరులు పాల్గొన్నారు.

◆ **వాటర్ బాటిల్స్ పంపిణీ**

మునిపల్లి(అందోల్): మండలంలోని మల్లికార్జునపల్లి పాఠశాల విద్యార్థులకు చీలపల్లి హెచ్‌ఎం ప్రవీణ్ కుమార్ శనివారం తన కొడుకు పుట్టిన రోజు సందర్భంగా వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **4న శరణ సమ్మేళనం**

జహీరాబాద్ టౌన్: వీరశైవ లింగాయత్ రాష్ట్రీయ బసవదళ్, లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో మార్చి 4 తేదీ నుంచి నిర్వహించనున్న విశ్వగురువు బసవేశ్వరుడి శరణ సమ్మేళనం(మహాసభలు) విజయవంతం చేయాలని రాష్ట్రీయ బసవదళ్ తెలంగాణ అధ్యక్షుడు శంకర్‌పాటిల్ కోరారు. రెండు రోజుల పాటు కొనసాగే మహాసభలకు కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 200 మఠాధిపతులు హాజరవుతారని ఆయన తెలిపారు.

◆ **కొనసాగుతున్న పశువైద్య శిబిరం**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని వైద్య సిబ్బంది ఎంఏ ఘనీ అన్నారు. శనివారం ఇబ్రహీంపూర్ గ్రామంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను వేసినట్లు తెలిపారు.

◆ **విరాళం అందజేత**

జిన్నారం(పటాన్‌చెరు): బొంతపల్లి గ్రామంలోని మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాల నిర్వహణకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రూ. 25వేల విరాళం ప్రకటించారు. ఈ మేరకు శనివారం జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, హుస్సేన్, సంజీవరెడ్డితో కలిసి నగదును నిర్వాహకులకు అందించారు.

◆ **నియామకం**

సంగారెడ్డి మున్సిపాలిటీ: భారత్ సైనిక్ బోర్డ్ సంగారెడ్డి సభ్యుడిగా వాసవి మా ఇల్లు వ్యవస్థాపక అధ్యక్షుడు తోపాజీ అనంత కిషన్ నియామకమయ్యాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవకాశం ఇచ్చిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ **చెక్కుల పంపిణీ**

సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వం లబ్ధిదారులకు అందిస్తున్న కల్యాణక్ష్మి, షాదీముబారక్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి అన్నారు. శనివారం ఐబీ బంగ్లాలో 24 మందికి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యాదమ్మ, రైతు బంధు మండల అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు పిల్లోడి విశ్వనాథం, ఇంద్రమోహన్‌గౌడ్, శివకుమార్, విద్యాసాగర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

◆ **కరాటేతో ఆత్మరక్షణ**

రాయికోడ్(అందోల్): ఆత్మరక్షణ కోసం కరాటే శిక్షణ ఎంతో దోహదపడుతుందని కరాటే శిక్షకుడు మిరాన్ అన్నారు. రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్ కార్యక్రమంలో భాగంగా రాయికోడ్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు కరాటే శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 8పాఠశాలల్లో బాలికలకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షకులు చందర్, శంకర్ ఆధ్వర్యంలో మార్చి 6వ తేదీ వరకు తరగతులను కొనసాగిస్తామని పేర్కొన్నారు.

◆ **ప్రమాదకర విద్యుత్ తీగలు తొలగించాలి**

ఝరాసంగం(జహీరాబాద్): అధికారుల నిర్లక్ష్యంతో ఇళ్ల మధ్య కరెంటు తీగలు ప్రమాదకరంగా మారాయి. మండలంలోని చీలమామిడి గ్రామంలో ఇళ్ల పైన విద్యుత్ తీగలు వేలాడుతుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవలే ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి కరెంటు షాక్ తగిలిందని గ్రామస్తులు తెలిపారు. ప్రజలు కర్రల సాయంతో విద్యుత్ తీగలను సపోర్ట్ పెట్టారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి వాటిని సరిచేయాలని కోరుతున్నారు.